# పుణ్యానికి పోతే ....

శరభయ్య బొటనవ్రేలంతలావు లంకపొగాకు చుట్టను గుండ్రంగ చుట్టూ పెదాలమధ్య తిప్పుతూ వేరేధ్యాసేమీ లేకుండా కాలుస్తూ కూర్చున్నాడు. అదే చెట్టునీడలో అయిదడుగుల దూరంలో చిన్న రాతిబండమీద చతికిలబడ్డ నడికారు కుర్రాడు శరభయ్య లంకపొగాకు చుట్టతో సమానంగా వెలిగించిన సిగరెట్టు చూస్తుండగనే చిన్నదై వ్రేళ్ళను చుర్రుమనిపిస్తే దాన్ని అవతలకు విసిరి మళ్ళీ కాల్చుకోడానికి సిగరెట్టులేక దిగాలుపడ్డట్టుగ మొగం తేలవేశాడు. బసుప్రక్కనే దాని నీడలో చతికిలపడ్డ ఆడాళ్ళమధ్య ఒకఒడిలో ఆరేళ్ళ కుర్రాడు శరభయ్యనూ, ఆవెనక రోడ్డుప్రక్క పొగవస్తున్న సున్నపుబట్టీ గొట్టాన్నీ విస్తుపోయి చూస్తున్నాడు.

చిన్న ప్రయాణంలో గున్నేనుగులాంటి స్థూలశరీరాన్ని స్థిరనిశ్చలతలోఉంచి చుట్ట కాల్చుకొంటున్న శరభయ్య ఓమారు గటిగా దమ్ము పీల్చి వదిలిపెట్టి "ఏంబావా బస్సు యీనాల్టికి బయలుదేరేట్టులేదే" అన్నాడు వెనక కూర్చున్న బావమర్ది లక్ష్మయ్యను సంబోధిస్తూ.

లక్ష్మయ్య "ఊఁ" అని ఊరుకున్నాడుగాని అంతకుతప్పించి జవాబు యివ్వలేదు.

"ఏం చేస్తున్నావయ్యా?" అంటూ వెనక్కు తిరిగాడు శరభయ్య. లక్ష్మయ్యప్రక్కనున్న యిరవై ఏళ్ళ కుర్రాడితో

ఏదో మాట్లాడుతూ కూర్చున్నాడు. బావమర్ది శరభయ్య ఏంచేస్తున్నావయ్యా అని అంటే లక్ష్మయ్య చిన్న చిరునవ్వు నవ్వి ప్రక్కనున్న కుర్రాడిని చూపిస్తూ "మన రాఘవయ్య లేడూ ... అదే మనఊర్లో సుందర్రామయ్యతో వియ్యం కట్టాడే రామాపురం రాఘవయ్య, అతని కొడుకట! పట్నంలో బి. ఎ. పరీక్ష యిచ్చి వస్తున్నాడట. " అన్నాడు.

'మన రాఘవయ్య' అనడంలో లక్ష్మయ్య ప్రతిభను అర్థంచేసుకొన్న శరభయ్య, రాఘవయ్యను ఎరక్కపోయినా నిండుగా చిఱునవ్వునవ్వి ఊరుకున్నాడు ఆ తర్వాత విషయం బావమర్దికే వదిలిపెడుతూ.

బావమర్దిలక్ష్మయ్య యిలాంటివిషయాల్లో మంచిఘటికుడు. నిమిషాలమీద యిట్టే సంబంధం స్థిరపరిచే వ్యవహారవేత్త. ఒకవిధంగా పెళ్ళిళ్ళపేరయ్య అనిపించుకున్నాడు. ఎలాలేదన్నా పది, పదిహేను పెళ్ళిళ్ళు తనచేతిమీద చేయించాడు. అన్నీ యిప్పుడు హాయిగా సంసారాలు సాగుతూన్నాయి. ఒక్క శరభయ్య పెద్దకూతురు సీతా లక్ష్మిది తప్ప. దానిరాత అలాఉండి ముండమోసి బ్రతుకు బండలైంది కాని లేకపోతే దానికేం రాజులాంటి బ్రతుకు.

"బస్సు బాగుపడింది రం" డంటూ కండక్టరు కేక వేశాడు. అంతవరకు ఆచెట్టుకింద జట్లుజట్లుగ కూర్చొని లోకాభిరామాయణాల్ని, వ్యాపారలాభాల్ని తిరగవేస్తున్న మగాళ్ళు, పేర్లదగ్గరనుండి మెళ్ళో కాసులపేర్లవరకు పరామర్శించుకొంటున్న ఆడాళ్ళు పిల్లల్నీ పీచుల్నీ వెంటబెట్టుకొని బస్సెక్కి

ఎవరిసీట్లలో వాళ్లు కూర్చున్నారు. శరభయ్య తనుకూర్చో వడానికి కాస్త అనువుగా ఉండేలా ముందే వెళ్ళి యింకా బావ మర్ది రాడేమిటి చెప్మా అంటూ ఎదురు చూస్తున్నాడు. చేతిలో చుట్ట ఎంతకీ కాలనంటోంది. ఇక కాల్చడానికి ఓపిలేకో, ఆవెనుక ఆడాళ్ళకు పొగ బాధ కలిగించడం యిష్టం లేకో చేతిలో చుట్టను బయటకు గిరాటువేసి కాండ్రించి ఓమారు ఉమ్మేశాసి, స్థలందొరికింది కదా అని సీటుకు జారబడి టాపును చూస్తూ కూర్చున్నాడు.

బస్సు బయలుదేరేముందు హారను వేయగా లక్ష్మయ్యా, కుర్రాడూ ఆదరాబాదరాగా వచ్చి బస్సెక్కారు. ఆకుర్రాడు డ్రైవరు ప్రక్క సీటులో కూర్చున్నాడు. లక్ష్మయ్య వెళ్ళి బావ మర్ది ప్రక్కనే చతికిలబడ్డాడు.

లక్ష్మయ్యలో ఉత్సాహంలేదు. కూర్చున్నవాడు కూర్చు న్నట్టుగా మౌనంగాఉండిపోయాడు. శరభయ్యకు సంగతేమిటో అర్థంకాలేదు. ప్రశ్నార్థకంగా బావమర్దివైపు చూశాడు. లక్ష్మయ్య కొద్దిసేపు మౌనంగాకూర్చుని పెదాలు చప్పరించి "అబ్బేలాభంలేదు బావా" అన్నాడు. అంటే అన్నట్టుగా లక్ష్మయ్యను చూసి "ఏం?" అన్నాడు శరభయ్య.

"ఏదో డబ్బు ఉందేమో అనుకున్నాకాని అంతా రెండే ళ్ళక్రింపటే హారించిపోయిందట! వెనక సుందర్రామయ్యతో వియ్యంకట్టేప్పుడు కాస్త కొద్దోగొప్పో చేతిలోఉన్నవాడే. పదెకరాల మాగాణీ, మూడెకరాల కొండ్ర, చేతిలో పది పది హేను వేలు నగదు ఉండేవి. ఈమధ్య మరోయిద్దరుకూతుళ్ళ పెళ్ళిళ్లుచేశాడట. కొత్తగాపొగాకువేసి ఓసంవత్సరం దెబ్బ

తిన్నాడట. ఇక పట్నంలో అబ్బాయి చదువుకు ఏటా రెండు వేలయినా అవుతుందికదా. మొత్తం చదువు పూర్తయే సరికి ఎనిమిదివేలదాకా ఖర్చు తేలుతోంది. అటు పెళ్ళిళ్ళకు యిటు చదువులకు వీటినన్నిటింకి చేతిలో నగదుపోగా ఉన్న ఆకొద్దిపాటి పొలం అమ్మేశాడట. ఏదో ఉన్నవాడూ, కూడ బొడిచినవాడూ అనుకున్నాను. ఇంతాచేస్తేయిదీ. ఇలాంటి వాడికి పిల్లనిస్తే అడుక్కునేందుకు చిప్ప చేతికిచ్చినట్లే. పిల్లాడు బుద్ధిమంతుడే. అయితేయేం? యీరోజుల్లో చేతిలో తడిలేక పోతే బ్రతికేదేమిటయ్యా?" అన్నాడు లక్ష్మయ్య సాధ్యమైనంత నిమ్మదిగ ఎదుటివాళ్ళకు వినిపించనంతగ నోట్లో గొణుక్కుని ఆరిపోయిన చుట్టను వెలిగించేందుకు అయిదు నిమిషాలు తంటాలుపడి మళ్లీ ప్రారంభించాడు. "చూడు శరభయ్యబావా. మనబుల్లికి మొగుడే దొరక్కపోతాడంటావ్? రేపువచ్చే ఆదివారం మొన్నటి సంబంధంసంగతేమిటో తేల్చుకొచ్చేస్తాను. అంతా సవ్యంగానే వ్యవహారంఉందిగాని ఎటొచ్చీ ఆవచ్చిన చిక్కంతా కట్నందగ్గరే. ఎంత బి. ఎ చదివితే మాత్రం యిరవై వేలా కట్నం. ఇల్లుగుల్లచేసి యిమ్మంటాడో, ఎక్కడన్నా ఎత్తుకొచ్చి యిమ్మంటాడో అర్థంగాకుండాఉంది. ఈసారి వెళ్ళినప్పుడు అటో యిటో తేల్చుకొచ్చేస్తాను. ఇది కాకపోతే మరొకటి. ఈ చేతులుమీదుగా పదిహేను పెళ్ళిళ్ళు జరిపించిన లక్ష్మయ్య మేనకోడలకు పెళ్ళిచేయలేడా?" లక్ష్మయ్య ఓమారు మీసాల్ని దువ్వి గబగబా నాలుగు దమ్ములు పీల్చి బావమర్ధి ముఖంలోకి చూశాడు, అంతసేపూ తను వాగిన దానికి బావమర్ధినుండి జవాబేమివస్తుందో అని.

శరభయ్య అయిదునిమిషాలు తాపీగా కూర్చొని "చూడు బావా" అన్నాడు. 'ఆ, చూస్తూనే ఉన్నాను. ఏమిటో చెప్పు' మన్నట్టుగా లక్ష్మయ్య మౌనంగా కూర్చున్నాడు.

"ఇరవై వేలుపోసి ఆకుర్రాడిని కొనుక్కోకపోతే ఏంపోయె? ఆడబ్బుపెట్టి లక్షణంగా ఏ లేనివాడికో యిచ్చుకొంటే చాలదూ? ఇంతకూ మనకు కావలసినదేమిటి? ఏదో దానిబ్రతుకది బ్రతుక్కొంటూ మనల్ని ఆశించకుండా ఉండాలనేకదా. లక్షాధికారి కిచ్చినా భిక్షాధికారి కిచ్చినా అదే ఆశతో పెళ్ళి చేస్తాం. కాకపోతే అంతస్థులకు తగ్గట్టుగ ఖర్చులవుతాయి. లక్షరూపాయలఆస్థి ఉన్నవాడి చేతిలో పెడ్తే మాత్రం సుఖిస్తుందని, వాడు దాన్ని పువ్వుల్లో పెట్టి పూజిస్తాడని మనం కలగన్నామా? అలా అని మనం వ్రాసి పుచ్చుకోలేదుగదా. దాని అదృష్టం బావుండి మొగుడు మంచివాడయితే అంత డబ్బున్నందుకు నాలుగు కాసులపేర్లు మెళ్ళో తగిలించుకొంటుంది. ఇందుకేనా మనం అన్ని వేలూపోసి ఆడబ్బున్నవాడి కిచ్చుకోవడం. చిలకల్లా పిల్లలు నవ్వుతూ కనుపించాలేగాని మెళ్ళో ఎంత బరువువుంటేమాత్రం ఏముంది? ఏదో మనం తెలీక డబ్బుపట్టుకొని వ్రేలాడతాంగాని. ఒక్కవిషయంచెప్తా ఆలోచించు. డబ్బు ఉందని ఆశకొలదీ చేసిన కాపురాలు చూడు. మన రాములు మనవరాలుది, రాఘవులు కూతుర్ది, ఆలయం వీధి మిఠాయి కొట్టు సూరిసెట్టి చిన్నకూతుర్ధి — అన్నీ ఏమయ్యాయి? అందుకే ఏదో లేనివాడినే మంచివాడిని చూసి చేద్దామని ఉంది. నోట్లో ఆమాత్రం అక్షరంముక్క పెట్టుకొని, పెళ్ళాన్నే పోషించుకోలేకపోతా డంటావ్. అటుపుణ్యం, యిటు పురు

పార్థం — రెండూ కలిసివస్తాయి. లేనివాడిని ఉద్ధరించాడన్న పేరూ వస్తుంది. మన బాధ్యతా నెరవేరుతుంది. ఏమం టావ్?" అంటూ లక్ష్మయ్య ముఖంలోకి చూశాడు శరభయ్య.

లక్ష్మయ్య సందేహంగ నసిగాడు "కాని మనఅంతస్థులకు తగ్గ సంబంధం కాకపోతే అంతా ఏమనుకుంటారు?"

"ఏమనుకుంటారయ్యా" మనపిల్ల భవిష్యత్తు మనం నిర్ణ యించాలిగాని వీళ్ళు అనుకోవడం అనుకోకపోవడంతో మనకు పనేమిటి? రేపు ప్రొద్దున్న దానిబ్రతుకెలాఉన్నా వీళ్ళంతా వెళ్ళి ఉద్ధరిస్తారాయేం?"

లక్ష్మయ్య తలాడించాడు. 'బావ చెప్పింది బాగానే ఉంది. పోనీ లేనివాడినే తెచ్చిచేస్తే కాస్తా విశ్వాశమైనాఉంటుంది. మనంచెప్పినట్టుకూడా నడుస్తాడు. కష్టపడి సంపాదించుకొంటాడు గనుక డబ్బువిలువ తెలుస్తుంది.' అనుకొంటూ ఆలోచించి ఆరి పోయిన చుట్టను అవతలకువిసిరి, ముందుసీటులో కూర్చున్న కుర్రాడితో అరగంటసేపు కూర్చొని మాట్లాడినా మళ్ళీ పరిశీల నగా అయిదునిమిషాలు అతడినే చూసి బావమర్దికి దగ్గరగా జరిగి "ఇందాకటి అబ్బాయి ఎలాఉన్నాడంటావ్ బావా?" అన్నాడు.

శరభయ్య మెలిపెట్టిన మీసాల సందుల్లోంచి మెల్లగా నవ్వి అన్నాడు. "అబ్బాయికేం. రాజులాఉన్నాడు. కాకపోతే పెద్ద డాంబికంగా లేడంతే."

"అలాగే ఉండాలి లెద్దూ. డాంబికంగా ఉన్నవాడిలో అసలుసరుకే కనుపించదు. పట్టి పైనపటారం లోనలొటారం వాళ్ళంతా. ఏమయినా సాదాగాపోయేవాడే మంచాడనుకో. నువ్వు సరిగ్గాచూడు ఆ అబ్బాయి బి. ఏ. చదివిన వాడిలా

అగుపిస్తున్నాడా? ఇందాక నాతో మాట్లాడినప్పుడు ఎంత వందనంగా మాట్లాడా డనుకున్నావ్! మనవాళ్ళల్లో ఎవరూ అలా మాట్లాడ్డం వినలేదనుకో. నీకూ నచ్చిందిగనుక ఏమయినా సాంప్రదాయంగల కుటుంబం అయితే రెండురోజుల్లో అన్ని విషయాలూ సంప్రదించుకొని సంబంధం స్థిరపరచుకోవచ్చు. ఎటొచ్చీమనం యిస్తామనాలేగాని రెక్కలుగట్టుకొని వాళ్ళంతా యిక్కడవాలరూ? అందులోనూ శరభయ్యతో సంబంధం కలుపుకోందామని వందలకొలది ఎదురుచూస్తూంటే కావాలని వీరికిస్తానంటే కాదంటారాయేం.? నువ్వు 'ఊఁ' అంటే రేపొచ్చే ఆదివారమే అటుపట్నంపోయేబదులు యిటుపల్లెకు వెళ్ళి ఏదోఒకటి రైటనిపించేస్తాను. పోనీ ప్రక్క ఊరేగా. యిద్దరం కలిసేవెళ్దాం. ఇటు వెళ్ళేబస్సుకు బయలుదేరితే అటు వచ్చేబస్సుకు రావచ్చు. ఏమంటావ్?"

శరభయ్య "సరే" అన్నాడు. మళ్ళీ బస్సు దిగేవరకూ యిరువురూ మాట్లాడుకోలేదు. బస్సుఆగాక అవతలికుర్రవాడు దిగివెళ్ళిపోయాడు. వెళ్ళిపోతున్న వాడినిపిలిచి "ఏంపేర న్నావుబాబూ?" అన్నాడులక్ష్మయ్య. "జనార్ధనరావండీ" అంటూ వెళ్ళిపోయా డతను.

ఇంటికివెళ్ళాక సంబంధం సంగతి భార్యచెవిలోవేశాడు శరభయ్య. "అదేమిటండీ" అంది ఆమెవిస్తుపోయి. తర్వాత "ఏడిచినట్టేఉంది మీ తెలివి. చూడగా చూడగా గుర్రం గాడి దయిందట! ఉన్నాకొద్దీ మీ తెలివి యిలా మండిపోతోందేం నిక్షేపంలాంటిపిల్లను తీసుకెళ్ళి ఆ అడుక్కునేవాడికా యిచ్చేది? నలుగురూవింటే నవ్వులాటతప్ప మరేమైనావుందా బంగారం!

లాంటిపిల్ల. ఏలక్షాధికారినో పెళ్ళాడవలసినదాని కిదేంఖర్మ మండీ. అసలుమీకు యీబుద్ధి ఎలాపుట్టిందంట? పోనీ డబ్బు లేదుగనకనా? యాభై వేలఆస్థి అలామూలపడి మూలుగు తోందికదా. ఇదంతా ఏంచేసుకుందామని, మిమ్మల్ని నన్ను కష్టపెట్టుకోవడానికి తప్ప"

"ఏడిశావ్ ఎర్రిదానా, నీమాత్రం తెలివినాకు లేదం టావా? ఏదోపిల్లను నువ్వేకన్నట్టూ, దానిభారమంతా నీకే చుట్టుకున్నట్టు మాట్లాడతావేం. అసలు సంగతి ఆలకించుమరి ఇరవై వేలుకట్నంపోసి మరోఅయిదువేలు ఖర్చుచేసి దానికి పెళ్ళిచెయ్యకపోతే ఏంపోయే? లేనికుటుంబంలోనుండి మంచి వాడినిచూసిచేస్తేమాత్రం లోటేమిటొచ్చిందంట? అయిదారు వేలతో అంతా తేలిపోతుంది. ఇంకాకావాలంటే పట్నంలో చిన్న పెంకుటిల్లొకటి కొనిచ్చేస్తే మళ్ళీ మనల్ని ఆశించకుండా ఆవచ్చినజీతంరాళ్ళతో ఆలుమగలు గడుపుకోలేరూ? పోనీ మీఅన్న నడుగుఏంచెప్తాడో. ఇందాకబస్సులోవస్తూ యిద్దరం కలిసి ఆలోచించిందేయిది."

"ఏమో నాకు ఏమీఅర్థంగావటంలేదు." అంటూ గొణిగింది ఆమె. శరభయ్య చిరునవ్వునవ్వాడు "చూస్తావుగా" అంటూ.

ఆదివారం రాగానే యిద్దరూ చద్దన్నం తిని ఫస్టుబస్సుకు ప్రయాణం కట్టారు. బస్సుఎక్కడమేమిటి రామాపురం చేరడ మేమిటి అన్నీ అయిదునిమిషాల్లో జరిగిపోయాయి. "ఈవాళ ఏవూరురుపండింనోగాని బస్సు బాగావెళ్ళింది బావా" అన్నాడు శరభయ్య.

"ఏదో ఊరుపండాలేమిటి. చూడు — మనం పెళ్ళిచూపు

లకు బయలుదేరేమంటే దేనికవే అన్నీ సమకూడిపోతున్నాయి. ప్రారంభంలోనే శుభసూచకం. అందులోనూ ఎరకమ్మ ఎదురు సామాన్యమా. వ్యవహారం యిట్టేఫైసలా అయిపోతుంది. ”

ఇద్దరూ బస్సుదిగారు. కండువాల్ని సరిచేసుకొని ఊరిలోకి నడిచారు. అక్కడక్కడ వాకబు చేసి అయిదు నిమిషాలకు రాఘవయ్యయిల్లు కనుక్కున్నారు. ఇద్దరూ అక్కడకు చేరే సరికి కాబోయేపెళ్ళికొడుకు వీధిలోనేఉన్నాడు. వీళ్ళనుచూసి ఆశ్చర్యపోయి చాపవేసి కూర్చోబెట్టాడు.

“ మీ నాన్న యింట్లో ఉన్నాడా బాబూ ” అన్నాడు లక్ష్మయ్య వ్యవహారానికి నాందిపలికి కూర్చొంటూ.

“ ఇప్పుడే పొలానికివెళ్ళారు. మీరు కూర్చోండి పిలిపిస్తా ” నని పాలేరును పంపించాడు. పాలేరు పరుగెత్తుకెళ్ళి పొలంలో పనిచేస్తున్న రాఘవయ్యను వెంటబెట్టుకొచ్చాడు. రాఘవయ్య వాకిట్లో కాలుపెడుతూ వీరిద్దర్నీ చూసి ఆశ్చర్యపోయి “ ఏమి టేమిటి లక్ష్మయ్యగారా ! ” అంటూవచ్చి వాళ్ళముందు చతికిలబడ్డాడు. ఆతర్వాత తాపీగా “ ఏదో దారితప్పివచ్చి నట్టున్నారే ” అన్నాడు.

“ అబ్బే, అలాంటిపొరపాట్లు జరగవండోయ్. మీతో పనుండబట్టే వచ్చాం. ” అన్నాడు లక్ష్మయ్య. అని కొంచెం సేపు మాట్లాడకుండా ఊరుకున్నాడు. ఈమధ్యసమయంలో అవతలివాడు ఆపనేమిటో తనను అడగాలని. అలానే అడిగాడు రాఘవయ్య. “ నాతోనా ” అని ఆశ్చర్యపోతూ.

“ ఆ. మీతోనే. రండి కూర్చోండి. వీరిని మీరు ఎరు గుదు రనుకొంటాను మాబావమరిదిశరభయ్యగారు. ” అన్నాడు

లక్ష్మయ్య శరభయ్యనుచూపిస్తూ. శరభయ్య చిన్నచిరునవ్వు నవ్వాడు యిద్దర్నిచూసి. రాఘవయ్య తబ్బిబ్బైపోయాడు. "వీరిని ఎరక్కపోవడమేమిటి. ప్రత్యక్షంగ ఎప్పుడూ కలుసుకొని మాట్లాడకపోయినా చాలాసార్లు యిద్దరం ఒకేబస్సులో బస్తీకి వెళ్తుండేవాళ్ళం. స్వయంగా మీఅంతటివారు పనిగట్టుకొని వచ్చారంటే ఏదోపెద్దవిశేషమే ఉండాలి."

లక్ష్మయ్య రంగంలోకి దిగేముందు చిన్ననవ్వు నవ్వి "ఏం లేదూ. మామేనకోడలు పెళ్ళీడుకొచ్చి నాలుగేళ్ళయింది. ఇంతవరకూ పెద్దగా పెళ్ళిప్రయత్నాలుమాత్రం చెయ్యలేదు. అయినా అప్పుడప్పుడు ఏవేవో సంబంధాలు వస్తూనేఉన్నాయి. ఇప్పుడు అప్పుడే; ఎందుకులెద్దూ అంటూ వచ్చినవన్నీ తిప్పి పంపించేశారు. అదీగాక వారి అభిప్రాయం వేరు. మొదటినుంచీ వారిది చాలామెత్తనిహృదయం. ఎవరన్నా బాధపడుతూంటే చూస్తూఊరుకోలేరు. డబ్బులేకపోయినా కాస్త చదువుకున్న వాడినిచూసి మంచివాడైతే ఏదో తోచినంత కట్నం యిచ్చి పెళ్ళిచేద్దామని వారి ఆశయం. అందుకే యీ నాలుగేళ్ళూ తగినవాడు దొరికినప్పుడే చెయ్యొచ్చులే అని ఊరుకున్నారు. కాని ... ... ... ... ..."

కాస్సేపుఆగి రాఘవయ్య ముఖంలోకిచూశాడు లక్ష్మయ్య. చాలా ఆతృతగ కళ్ళను తనవైపుఒదిలిచూస్తున్నాడు. ఇక అట్టేసేపు ఆతన్ని బాధించడం యిష్టంలేక మళ్ళీ ప్రారంభించాడు ... "కాని ఏమైనా ఏదో ఒకసంబంధం వెతికి యీఏడే చేసేద్దా మనుకొంటుండగా మొన్న బస్తీకివెళ్ళి బస్సులో వస్తోంటే మీవాడు కనుపించాడు. మీవాడని నాకేం తెలుసు?

వచ్చి ప్రక్కన కూర్చొంటే వివరాలవీ అడిగాను. అప్పుడు చెప్పాడు ఫలానాఅని. అబ్బాయి బస్సుదిగి వెళ్ళిపోయాక బావగారు నాతో అన్నారు 'కుర్రాడు మనబుల్లికితగ్గ జోడు కదూ బావా' అని మీసాంప్రదాయం గౌరవం మర్యాద ఎరిగినవాడిని గనుక బావగారితో అన్నిసంగతులుచెప్పి పెద్ద హంగామా లేకుండానే యిద్దరంకలసి సంబంధం తేల్చుకు పోదామని వచ్చాం." అన్నాడు లక్ష్మయ్య.

రాఘవయ్య ఉబ్బితబ్బిబ్బయిపోయాడు. ఓమారుయింట్లోకి వెళ్ళి ఆడవాళ్ళందరికీ యీసంగతిచెప్పి మళ్ళీవచ్చి కూర్చు న్నాడు. ఇలా యిక్కడ రాఘవయ్య మాట్లాడుతూండగానే బావమర్దికి కబురెప్పుడెళ్ళిందో పరుగెత్తుకొచ్చాడు వీరయ్య.

వీరయ్యను చూడగానే రాఘవయ్య గుండెల్లో రాయి పడింది. సమయానికి 'వీడెందుకొచ్చాడూ. తనకూతుర్ని కాదని డబ్బాశతో పై సంబంధానికి వప్పుకొంటున్నానని యిక్కడ ఏమాత్రం నోరుజారినా యింతవ్యవహారం యిట్టే మంటగలిసిపోతుంది. ఈవచ్చేఅదృష్టంకూడా అంటకుండా పోతుంది. ఇప్పుడేంచేసేదీ' అంటూ ఆలోచించి ఏమయినా బావమర్దిని యిందులో దూర్చితేగాని లాభంలేదనుకొని వీరయ్య బావను ఆయిద్దరికి పరిచయంచేసి "ఏదోవ్యవ హారం నువ్వే ఒడ్డెక్కించెయ్యి." అన్నాడు అంతసేపూజరిగిన సంభాషణను బావమర్దికి టూకీగాచెప్పి.

వీరయ్యకూడా వ్యవహారాల్లో మునిగితేలుతున్నవాడు. కోర్టులదగ్గరనుండి కట్నాలవరకు రకరకాల వ్యవహారాల్ని నడిపి సిద్ధహస్తుడనిపించుకున్నాడు.

బావమరిది చేస్తున్న పనికి లోలోపల ఉగ్గిబుగ్గయిపోతున్నా పైకిమాత్రం నవ్వుతూనే 'ఓహో' 'అహా' అంటూనే సంబంధం "సరేఖాయం" అంగీకరించాడు.

"మరి మీలాగా మేము గొప్పలకి పోలేనుండోయ్. అంతస్థులకుతగ్గ మర్యాద జరిపించగలమో లేమోనని భయపడుతున్నాం. పెళ్ళికి రెండుమూడువేలు ఖర్చవుతుందనుకుంటాను. ఇల్లొకటి — దూలాలు పుచ్చిపోయి పడిపోయేట్టుంది. పెళ్ళే పెళ్ళి! అదికూడా బాగుచేయించాలి. అదిగాక యింటిమీద అప్పొకటి. అంతటికీ ........" నసిగాడు వీరయ్య.

"పోనీమీరు అంతగా అడుగుతున్నారు గనుక కట్నం అయిదువేలూకాక పెళ్ళిఖర్చులుకూడా భరిస్తాంలెండి. మునుపటి రోజులు కాదుకదా అయిదువేలూ చేతితో పట్టుకొని అయిదురోజులు పెళ్ళిచేయడానికి."

వీరయ్య తెల్లమొగంవేశాడు. 'ఇంటిగుట్టు బట్టబయలు చేస్తే వచ్చినవాళ్ళు వెనక్కు తిరుగుతారనుకుంటే యిదేమిటి!'

శరభయ్య లక్ష్మయ్య లేచి నుంచున్నారు. "వచ్చేసోమవారం మంచిదనుకుంటాను. తాంబూలాలు పుచ్చుకోవచ్చు" అన్నాడు శరభయ్య. సరే అని బావమరుదు లిద్దరూ తలూపి కూడా బస్సువరకూవెళ్ళి వాళ్ళను బస్సెక్కించి వెనక్కి బయలుదేరారు. వస్తున్నప్పుడు దారిలో "నీఋణం ఎలాగా తీర్చుకోగలనుబావా. నువ్వే పూనుకోకపోతే యిది సాగే అయ్యేదే కాదు. మన అమ్మాయిని కాదని పైసంబంధం చేస్తున్నందుకు ఏమనుకుంటావో ఏమో" అన్నాడు రాఘవయ్య వీరయ్య చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొంటూ.

"అబ్బే, నేనేమనుకుంటాను. సిరి కలిసి వస్తోంటే కాల దన్నడ మెందుకు." అన్నాడు వీరయ్య బలవంతంగా నవ్వి. ఇద్దరూ విడిపోయారు.

నాలుగోనాడు పనిగట్టుకొని బావమర్ది యింటికి వెళ్ళాడు వీరయ్య. వీరయ్యనట్టింట్లో కాలుపెట్టేసరికి చెల్లెలు బావమర్ది పెళ్ళిగురించే మాట్లాడుకొంటూ కూర్చున్నారు.

"రా అన్నయ్యా" అంది చెల్లెలు. వీరయ్యవెళ్ళి కూర్చున్నాక "ఏమిటో యీసంబంధం నాకు యిష్టంలేదు. ఎంచక్కా నిక్షేపంలాంటి మేనరికం. అది వదులుకొని పై వాటికి పోవడ మేమిటి? మీబావకు డబ్బాశతప్పితే మరేమీలేదు. మంచో చెడో ఏమీ తెలుసుకోకుండానే 'ఊ' అనేస్తారు." అంది.

వీరయ్య కొంచెం ఆలోచించినవాడిలా మౌనంగాకూర్చొని తలగోక్కుంటూ "కాని – బావా అసలు సంగతి ఆలోచించావ్?" అన్నాడు. ఎదుటి ముఖంలో ప్రశ్నార్థకాన్ని చూసి మళ్ళీ ప్రారంభించాడు వీరయ్య. "పిల్లనుమనం కావాలని అనకుండానేవచ్చి కోరియిస్తున్నారంటే ఏమయి ఉంటుదంటావ్? పెళ్ళిఖర్చు కానీకూడా మనం పెట్టుకోకుండా అంతా వాళ్ళేభరిస్తూఉండడంలో ఉద్దేశం ఏమిటి? దానికితోడు ...యిదువేలుకట్నం. అన్నీ మనం అడక్కుండానే అంతా వాళ్ళే చెప్పేస్తున్నారు. ఆఖరుకు యింటిమఖామత్తుకుకూడా ..దోయిచ్చేట్టే ఉన్నారు. ఇదంతా దేనికంటావ్. ఈసంగతి నువ్వు ఆలోచించావా? పిల్ల పెళ్ళీడుకొచ్చినా నాలుగేళ్ళు పెళ్ళికాకుండా ఉండిపోయిందంటే ... నిజం ఎలాఉన్నా అనుమానంమాత్రం పీడిస్తూంటుందికదా. అదీకాక మరొకవిషయం

పెద్దపిల్లకు పెళ్ళిచేసిన ఆర్నెల్లకేముండమోసి యింట్లో కూర్చుండట. అసలు అంత డబ్బున్నందుకు ఏలక్షాధికారితోనో వియ్యం కలపడంపోయి వెతుక్కొచ్చినట్టు మనకాళ్ళదగ్గిరికి రావడం ఏమిటి? మనిషి ఎంతమంచివాడయితేమాత్రం ఉద్ధరింపన్న పేరుతో కన్నకూతుర్ని కానీ ఆస్థిలేనివాడి చేతులో పెడ్తాడంటావ్? ఏమోబావా నాకేమీ పాలుపోకుండాఉంది. ఏమి కంగారుపడ్డా ఏమొచ్చి పడుతుందోనన్న భయం."

వీరయ్య ప్రసంగం ఆపి యిద్దరిముఖాల్లోకీ చూశాడు. కత్తివాటు పెట్టినా నెత్తురుచుక్క కనుపించేట్టు లేదు.

"అవునన్నయ్యా. ఆమాటా నిజమే. నాకూ అదేసందేహం వచ్చింది. డబ్బుఎరచూపి కన్ను ముయ్యాలనుకున్నారు. ఇంకానయం. ముందే తెలుసుకున్నాం" అంది రాఘవయ్య భార్య రమణమ్మ. రాఘవయ్య కూడా ఓమారు బుర్రగోక్కున్నాడు. "అవును బావా యిదేదో గోల్‌మాల్‌లానేఉంది."

ఆమరుసటిరోజే అక్కడ శరభయ్య లక్ష్మయ్యలు తాపీగా జానెడంతపొడుగు, బొటనవ్రేలంతలావు లంకపొగాకుచుట్టల్ని కాల్చుకొంటూ పెళ్ళిచర్చచేస్తుండగా ఊరూపేరూలేనివాడెవడో వచ్చి "రాఘవయ్య మీసంబంధాన్ని చేసుకోనంటున్నాడయ్యా" అంటూ చెప్పిపోయాడు. ఆతర్వాత పదిపదిహేను రోజులకుగాబోలు బావమర్దులిద్దరూ కూర్చొనిఉండగా గాలికబురొకటి ఎవడోతీసుకొచ్చాడు "వీరయ్యకూతుర్ని రాఘవయ్యకొడుక్కిచ్చాడటయ్యా" అని.

ఎ.పి. ... గ్రంథాలయం. ...
ప్రవేశ సంఖ్య 28028
తేది